నమస్తే తెలంగాణ
ఖమ్మం
8 | ఖమ్మం, శనివారం 8 ఫిబ్రవరి 2025 | KHAMMAM

భాగ్యనగర్‌తండాలో ఎమ్మెల్సీ తాతా మధుతో మాట్లాడుతున్న వృద్ధుడు వాంకుడోతు బన్సీలాల్

కేసీఆర్ సారే మళ్లీ సీఎం కావాలె..

కారేపల్లిలో ఎమ్మెల్సీ తాతా మధుతో ఓ వృద్ధుడి ఆకాంక్ష

ఆ వృద్ధుడి వయసు 60 ఏళ్లకు పైగానే. పదేళ్ల కేసీఆర్ పాలనను కళ్లారా చూశాడు. ప్రస్తుత కాంగ్రెస్ 14 నెలల పాలనను నిశితంగా గమనించాడు. అయినా పదేళ్లు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పాలించిన కేసీఆర్ పాలనే మళ్లీ కావాలని పరితపిస్తున్నాడు. తన మనసులోని మాటను బయటపెట్టాడు. కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ క్రమంలో ఓ వీధిలో కాలినడకన వెళ్తున్న తాతా మధుకు తండాకు చెందిన వాంకుడోతు బన్సీలాల్ తారసపడి కొద్దిసేపు ముచ్చటించాడు. 'కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే అన్ని వర్గాల ప్రజలకు మంచి జరిగింది. ఆయన చేసిన పనులే గ్రామాల్లో ఇంకా కళ్ల ముందు కనిపిస్తున్నాయి. కాంగ్రెసోళ్లు మాయగా ఎక్కడి నుంచి వచ్చారో ఏమో. కాంగ్రెస్ పాలనతో తెలంగాణ రాష్ట్రానికి దరిద్రం పట్టుకుంది. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా చేసింది గుండు సున్నా' అని బన్సీలాల్ చెప్పుకొచ్చాడు. దీంతో అక్కడున్న బీఆర్ఎస్ నాయకులు మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే, అంతా మంచే జరుగుతుంది అని భరోసా ఇచ్చారు. **–కారేపల్లి, ఫిబ్రవరి 7**

పథకాల పేర్లు మార్చడమే పాలనా?

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

- రాష్ట్రంలో ఏడాదికే దివాలా తీసిన కాంగ్రెస్ పాలన
- ప్రజలు బీఆర్ఎస్ పాలన మళ్లీ కావాలంటున్నారు..
- ఢిల్లీకి మూటలు పంపడం కోసమే హైడ్రా
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

కారేపల్లి, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో ఏడాది కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని, గత కేసీఆర్ ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి హడావిడి చేయడం తప్ప 14 నెలల కాలంలో వారు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఆరోపించారు. మండలంలోని భాగ్యనగర్‌తండాలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత కళ్లముందు కనిపిస్తున్నదని, మళ్లీ కేసీఆర్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. గడిచిన పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం ఎంతగా అభివృద్ధి చెందిందనే విషయాన్ని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కళ్లముందుంచారన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికే దివాలా తీసిందని, ఆ పార్టీ ప్రజాప్రతినిధులే పాలనపై అసమ్మతి వ్యక్తం చేయడం ఇందుకు నిదర్శనమని విమర్శించారు. ఎడాపెడా 420 హామీలు ఇచ్చి ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నామని అసెంబ్లీ స్పీకర్ ప్రసాదరావు స్వయంగా ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నే ప్రభుత్వ పనితీరును ఎండగట్టడం రేవంత్‌రెడ్డికి సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ శాఖ మంత్రి అడ్డంగా దోచుకుంటున్నాడని జడ్చర్ల ఎమ్మెల్యే బహిరంగంగా దూషిస్తుంటే.. పాలనా తీరు ఎలా ఉందో ప్రజలు అర్థమవుతోందన్నారు. ఢిల్లీకి మూటలు పంపడం కోసమే హైడ్రాను తెరపైకి తెచ్చారన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి నాయకత్వం సముచిత స్థానం కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ముత్యాల సత్యనారాయణ, ఉన్నం వీరేందర్, రావూరి శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, ముత్యాల వెంకట అప్పారావు, అడపా పుల్లారావు, బానోత్ కుమార్, శివరాత్రి అచ్చయ్య, బత్తుల శ్రీనివాసరావు, బానోతు రాందాస్, ఇస్లావత్ బన్సీలాల్, సిద్ధంశెట్టి నాగయ్య, జాలా సాంబ, షేక్ ఖాజావలి, యాకుబ్ పాషా, షేక్ సలీం పాల్గొన్నారు.

బీసీలను ముంచేందుకే కులగణన

కులగణన సర్వేలో బీసీ కులస్తులను తక్కువగా చూపించడం నట్టేట ముంచడమే అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే అంతా బూటకం. బీసీలను రాజకీయంగా అణగదొక్కాలనే ఉద్దేశంతో బీసీల శాతాన్ని తక్కువగా చూపించారు. పెరుగుతున్న జనాభానుబట్టి బీసీల జనాభా ఎక్కువగా ఉంటుందనేది ఎవరికైనా తెలుస్తుంది. ఈ విషయం ప్రభుత్వానికి తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. ఇదంతా తప్పుడు సర్వే అని అర్థమవుతోంది.
–రాంబాబు, బీఆర్ఎస్ మండల బీసీ కార్యవర్గ సభ్యుడు

రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే..

అగ్రవర్ణాల కులస్తుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వే చేసినట్లు స్పష్టంగా అర్థమవుతున్నది. నామమాత్రంగా సర్వే చేసి పూర్తయిందని చెప్పడం సరికాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరాల్సిందే. ప్రభుత్వం చేసిన సర్వే తీరును ప్రతి ఒక్కరూ తప్పుపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ స్థానాలు పెంచి బీసీలను రాజకీయంగా ప్రోత్సహించాలి.
–నూనె హరిబాబుయాదవ్, రామన్నపాలెం, వేంసూరు మండలం

కులగణన అంతా బోగస్

కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే అంతా బోగస్. ఇల్లిల్లూ తిరగకుండానే నామమాత్రంగా సర్వే చేసి చేతులు దులుపుకుంది. రోజురోజుకూ పెరుగుతున్న జనాభాను పరిగణనలోకి తీసుకోకుండా తగ్గించి లెక్కలు చూపించడం ఎంతవరకు సబబు. పూర్తి సర్వే చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీలందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలి.
–వట్టం రాంబాబు, మణుగూరు

బీసీలకు అన్యాయం

బీసీ కులగణనలో అసంపూర్తి సమాచారం ఉంది. అగ్రవర్ణాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేసినట్లు తెలుస్తుంది. 100 శాతం సర్వే చేయకుండా తూతూ మంత్రంగా చేసి పూర్తయిందని చెప్పడం దారుణం. బీసీలకు అన్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి.
–మహంకాళి రామారావు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు

42 శాతం రిజర్వేషన్లుండాలి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన కులగణన సర్వేతో పోల్చితే ఈ సర్వేలో బీసీ జనాభా పెరగాల్సి ఉండగా.. తగ్గింది. 100 శాతం సర్వే జరగలేదు. బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే బీఆర్ఎస్ వారికి అండగా ఉంటుంది. బీసీలకు వెంటనే 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి.
–బెజ్జంకి కనకాచారి, సారపాక

తప్పుల తడకలా కులగణన

రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన కులగణన సర్వే తప్పుల తడక. మొక్కుబడిగా సర్వే చేసి బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపుతోంది. రాష్ట్రంలో అత్యధికంగా బీసీలు ఉన్నారనేది జగమెరిగిన సత్యం. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను మరుగున పడేసి తప్పుదోవ పట్టిస్తుంది. బీసీలకు అన్ని రకాలుగా అన్యాయం జరుగుతోంది. సరైన సమయంలో బీసీల సత్తా చూపుతాం.
–దొడ్డి తాతారావు, బీసీ నాయకుడు, బీఆర్ఎస్ మండల కన్వీనర్, చర్ల

- రిజర్వేషన్లలో బహుజనులకు తీరని ద్రోహం చేసింది
- 2014లో 1.85 కోట్లుంటే.. 2025లో 1.64 కోట్లా?
- పదేళ్లలో పాతిక లక్షల బీసీలు ఎలా తగ్గారో చెప్పాలి
- అదే సమయంలో ఓసీల జనాభా ఎట్లా పెరిగిందో చూపాలి
- బడుగులను అణగదొక్కేందుకే రేవంత్ సర్కారు కుట్ర
- హడావిడిగా సర్వే చేసి తప్పుడు లెక్కలు చెబితే నమ్మం
- 42 శాతం రిజర్వేషన్లు కల్పించేదాకా వదిలిపెట్టం
- రిజర్వేషన్ల ద్రోహంపై రగిలిపోతున్న జిల్లా బీసీలు

మోసకారి కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి మోసకారి ప్రభుత్వమని ఉమ్మడి ఖమ్మం జిల్లా బీసీలు మండిపడుతున్నారు. ఎన్నికలకు ముందు ఆశజూపి హామీ ఇచ్చిందని, అధికారం 'చేతి'కి చిక్కాక ద్రోహం తలపెట్టిందని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి రాగానే రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తీసుకొస్తామంటూ ఎన్నికల సభల సాక్షిగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని తూర్పారబట్టారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాగితపు ముక్క కూడా లేకుండా కాల్చివేసిందని కోపోద్రిక్తులయ్యారు. కేవలం ఈడబ్ల్యూఎస్ కోటా కోసం బీసీలను అణగదొక్కాలన్న కుట్ర ఉన్నట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వ తీరు కన్పిస్తోందని ఆరోపించారు. 2014లో 1.85 కోట్లుగా ఉన్న బీసీలు 2025లో 1.64 కోట్లకు ఎలా తగ్గుతారని ప్రశ్నించారు. అదే సమయంలో ఓసీల జనాభా అంతే గణనీయంగా ఏవిధంగా పెరిగిందో చూపాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం హడావిడిగా కులగణన చేపట్టిందని ఆరోపించారు. సర్వేను సమగ్రంగా చేపట్టకుండా కాకిలెక్కలను చూపిస్తోందని ధ్వజమెత్తారు. ఈ తప్పుడు గణాంకాలను తాము ముమ్మాటికీ నమ్మబోమని స్పష్టం చేశారు. అదే సందర్భంలో తమకు ఇచ్చిన మాట ప్రకారం రాజ్యాంగపర చిక్కులేని 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకూ ఈ రేవంత్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని తేల్చిచెప్పారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తెస్తామంటూ నమ్మబలికి గత అసెంబ్లీ ఎన్నికల్లో తమతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్.. ఇప్పుడు తప్పుడు లెక్కలు చెబుతోందని, కేంద్రం ఆమోదించాలంటూ మెలికలు పెడుతోందని మండిపడ్డారు. రిజర్వేషన్ల అంశంలో ఈ ప్రభుత్వం తమకు ద్రోహం చేసిందంటూ రగిలిపోతున్నారు.
–ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 7

బీసీలకు అన్ని విధాలా అన్యాయం

అత్యధిక శాతం జనాభా ఉన్న బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. సమగ్ర సర్వే పేరుతో మొక్కుబడిగా సర్వే నిర్వహించి కాకి లెక్కలు చూపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది చేయదని కులగణన సర్వే ద్వారా రుజువైంది. వాస్తవాలను వక్రీకరించిన కాంగ్రెస్ విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్న రేవంత్ చేసిన నమ్మక ద్రోహానికి గుణపాఠం చెప్పడం ఖాయం.
–పంజా రాజు, బీసీ నాయకుడు, చర్ల

బీసీ కులగణన ఒట్టి అబద్ధం

స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరెత్తింది. అదంతా ఒట్టి అబద్ధం. అత్యధికంగా ఉన్న బీసీల ఓట్లతో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోంది. బీసీ జనాభాను తక్కువ చేసి చూపెడుతోంది. బీసీ సంఘాలన్నీ దీనిపై ఆలోచన చేయాలి. బీసీలకు బేషరతుగా కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి.
–భూపతి రమేశ్, బీసీ సంఘం నాయకుడు, చండ్రుగొండ మండలం

సర్వేలో జనాభా తగ్గుతుందా?

గత ముఖ్యమంత్రి కేసీఆర్ చేయించిన సమగ్ర సర్వేలో బీసీలు 52 శాతం ఉన్నట్లు నిర్ధారణ కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేలో 46 శాతం ఉండటం ఏమిటి? ఎక్కడైనా సర్వేలో జనాభా పెరుగుతుంది. కానీ తగ్గుతుందా? రాజ్యాధికారంలో బీసీలను భాగస్వాములు చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వంలో పూర్తిగా లోపించింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడం కోసం ఇలాంటి తప్పుడు సర్వే చేసి బీసీలను అన్యాయం చేయడం తగదు.
–బొల్లి వెంకట్రావు, తూరుబాక, దుమ్ముగూడెం మండలం

సర్వేలో బీసీలకు అన్యాయం

తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి బీసీలపై చిన్నచూపు చూస్తోంది. సర్వే రిపోర్టులను పబ్లిక్ డొమైన్‌లో విడుదల చేశారు. అవి పూర్తిగా తప్పుగా ఉన్నాయి. దేశంలో జనాభా పెరుగుతుంటే, తెలంగాణలో మాత్రం జనాభా తగ్గుతుందని సర్వేలు స్పష్టం చేయడం వింతగా ఉంది. రాష్ట్రంలో ముదిరాజుల సంఖ్య ప్రభుత్వం తెలిపిన దానికంటే ఇంకా ఎక్కువ ఉంటుందని మేము అనుకుంటున్నాం.
–గాజుబోయిన ఏసుబాబు, బీసీ సంఘం నాయకుడు, దమ్మపేట

బ్రహ్మాలకుంటకు చిరుతపులి!

గ్రామస్తుల సమాచారంతో ఆనవాళ్లు సేకరించిన అటవీ శాఖ సిబ్బంది

పెనుబల్లి, ఫిబ్రవరి 7: పెనుబల్లి మండలం బ్రాహ్మాలకుంట శివారు మామిడితోటలో చిరుతపులి పాదముద్రలను గురువారం రాత్రి గ్రామస్తులు గుర్తించారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేయడంతో వారు మైక్ ద్వారా గ్రామంలో ప్రచారం చేశారు. రాత్రివేళ ఎవరూ బయటకు రావొద్దని, చిరుతలు ఎక్కువగా రాత్రిపూట సంచరిస్తాయని చాటింపు వేశారు. శుక్రవారం ఉదయం తల్లాడ రేంజ్ అధికారి ఉమ తమ సిబ్బంది, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణలతో కలిసి మామిడి తోటను సందర్శించారు. చిరుతపులి తిరిగిన ప్రదేశంలో పాదముద్రల కొలతలు సేకరించారు. వన్య ప్రాణులను సంరక్షించడం అందరి బాధ్యత అని, ఏదైనా అత్యవసరమైతే అటవీ శాఖ అధికారులకు తెలపాలని రేంజ్ ఆఫీసర్ సూచించారు.

చిరుత పాదముద్రల గుర్తులు సేకరిస్తున్న అధికారులు

టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు సాధించాలి

- పిల్లలకు అర్థమయ్యేలా బోధన జరగాలి
- ఎంఈవోలు, హెచ్ఎంల సమీక్షలో కలెక్టర్

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 7: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం జడ్పీ కార్యాలయంలో ఎంఈవోలు, హెచ్ఎంలతో టెన్త్ పరీక్షలు, విద్యాశాఖ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అభ్యాసన స్థాయిల్లో నాణ్యతమైన పురోగతి సాధించాలన్నారు. ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు విద్య అందుతుందన్న నమ్మకం తల్లిదండ్రులకు కల్పించాల్సిన బాధ్యత హెచ్ఎంలపై ఉందన్నారు. పిల్లలకు అర్థమయ్యేలా బోధన జరగాలని సూచించారు. బోధనలో టీచర్ల లోపాలను గమనించి అవసరమైన సలహాలు హెచ్ఎంలు ఇవ్వాలని, చివరి బెంచ్ విద్యార్థికి కూడా సబ్జెక్టుపై ఆసక్తి కలిగించాలన్నారు. టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులతోపాటు తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలన్నారు. విద్యతో పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు మంచి పునాదులు వేయాలన్నారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలని, ప్రతి ఒక్క టీచర్ పంచసూత్రాలైన ఐదు అంశాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కలెక్టర్ సమీక్షకు ముందు డీఈవో టెన్త్ స్పెషల్ టెస్ట్‌ల్లో పాఠశాలల వారీగా విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. డీఈవో సోమశేఖరశర్మ, డీసీఈబీ సెక్రటరీ నారాయణ, ఏఎంవో రవికుమార్, యూడైస్ భానుప్రకాష్, సీఎంవో రాజశేఖర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

హెచ్ఎంలతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డీఈవో శర్మ

వసతిగృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి

- నాణ్యత లేని పదార్థాలను వినియోగించొద్దు
- పాల్వంచ హాస్టల్ సందర్శనలో భద్రాద్రి కలెక్టర్

వసతిగృహంలో నేలపై కూర్చొని విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాల్వంచ, ఫిబ్రవరి 7: ఆశ్రమ గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు సౌకర్యాలు మరింతగా మెరుగుపరచాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పాల్వంచ ఆశ్రమ గురుకుల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదిని కలియతిరుగుతూ పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరా తీశారు. డార్మెటరీ డోర్లు , కిటికీలు, తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. డార్మెటరీ హాల్‌లో దోమలు రాకుండా జాలి ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యత లేని పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించొద్దన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. కలెక్టర్ వెంట డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, హెచ్ఎం భద్రు, సిబ్బంది ఉన్నారు.

'సహకార' విస్తరణ

- రైతులకు మరింత అందుబాటులో సేవలు
- భద్రాద్రి జిల్లాలో ఇప్పటికే 21 పీఏసీఎస్‌లు
- కొత్తగా 35 ఏర్పాటుకు ప్రతిపాదనలు
- త్వరలోనే అధికారిక మంజూరు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 7: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సేవలు రైతులకు మరింత అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఉన్నతాధికారులు కొత్త సంఘాలు ఏర్పాటు దశగా కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే జనవరి 2వ తేదీన జిల్లా, 4వ తేదీన రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో ఇప్పటికే 21 పీఏసీఎస్‌లు ఉండగా.. కొత్తగా 35 సంఘాలు ఏర్పాటు కోసం దరఖాస్తులు అందాయి. వీటి జాబితాను ప్రభుత్వానికి అందించారు. త్వరలోనే అధికారికంగా కొత్త సంఘాల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ రాబోతోంది. సమగ్ర సేవల విస్తృతిలో భాగంగా కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల రైతులకు సహకార సంఘాల సేవలు మరింత చేరువకానున్నాయి. పల్లె బ్యాంకులుగా పేరొందిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) సేవలను జాతీయస్థాయిలో విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంఘాల సేవలను రైతులకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కొత్త సంఘాల ఏర్పాటుకు అనుమతినిచ్చింది. దీంతో జిల్లాలవారీగా అవసరమైన కొత్త సంఘాల కోసం ఉన్న పీఏసీఎస్‌ల నుంచి అధికారులు దరఖాస్తులు అందుకున్నారు. ఇందుకోసం జిల్లాస్థాయిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్త సంఘాలు ఏర్పాటు చేయాల్సిందిగా 35 దరఖాస్తులు అందాయి. ఎక్కువ మంది రైతులు లేదా గ్రామాలు ఉన్న సొసైటీల తీరును బట్టి విభజించాలని అధికారులు నిర్ణయించారు.

కమర్షియల్ బ్యాంకులకు దీటుగా..

కమర్షియల్ బ్యాంకులకు దీటుగా రైతులకు సేవలు అందిస్తున్న పీఏసీఎస్‌లు విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. సాగు మొదలు పిల్లలకు విదేశీ రుణాల వరకు విభిన్న సేవలను పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు అందుతున్నాయి. రైతులకు సొసైటీల సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని కొత్త సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించింది. గడిచిన దశాబ్ద కాలంలో సొసైటీల్లో సభ్యుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. 2008లో కష్టాల్లో ఉన్న కాలక్రమేణా ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే నాబార్డు సహకారంలో రైతులకు కమర్షియల్ బ్యాంకులకు దీటుగా నాణ్యమైన సేవలు అందిస్తున్నాయి.

కొత్త సంఘాలకు 35 దరఖాస్తులు

జిల్లావ్యాప్తంగా 21 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటికి అదనంగా కొత్తగా 35 పీఏసీఎస్‌ల ఏర్పాటు కోసం దరఖాస్తులు అందాయి. రైతుల సంఖ్య, ఎక్కువ గ్రామాలు ఉన్న పీఏసీఎస్‌ల తీరును బట్టి కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందించాం. ప్రభుత్వం ఎన్ని సంఘాలకు అనుమతినిస్తే వాటిని ఏర్పాటు చేస్తాం. **–ఖుర్షీద్, డీసీవో, కొత్తగూడెం**

సమస్యాత్మక గ్రామాల్లో బందోబస్తుకు ప్రత్యేక ప్రణాళిక: సీపీ

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 7: రానున్న స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అధికారులకు సూచించారు. శుక్రవారం పోలీస్ కమిషనరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ రాగానే శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు కోసం రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పోలింగ్‌స్టేషన్లు, బూత్‌ల వద్ద పరిస్థితులు, వనరులపై వివరాలు సేకరించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేటగిరీల్లో పోలింగ్ బూత్‌లను విభజించి బందోబస్తుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రౌడీషీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితాను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, ఏసీపీ వెంకటేష్, సాంబరాజు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విజిలెన్స్ కేసులు పరిష్కరించాలని డిపెండెంట్ అభ్యర్థుల ధర్నా

కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న డిపెండెంట్ అభ్యర్థులు

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 7: సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల అంశంతోపాటు పలు సమస్యలపై విజిలెన్స్ కేసులు ఎదుర్కొంటున్న డిపెండెంట్ అభ్యర్థులు బెల్లంపల్లి ఏరియా గోలేటి నుంచి పాదయాత్రగా కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీసు వద్దకు శుక్రవారం చేరుకొని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వారి ఆందోళనకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంతోపాటు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. పోలీసు అధికారులు చెప్పినప్పటికీ డిపెండెంట్ అభ్యర్థులు, కార్మిక సంఘాల నాయకులు వినకుండా 'ఉద్యోగాలు ఇచ్చుడో.. మేం సచ్చుడో' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.